ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
కామారెడ్డి జిల్లా వార్తలు
5
శనివారం 30 ఆగస్టు 2025




ఇంట్లో వరదకు తడిచిన బియ్యాన్ని బయటకు తీసుకువస్తున్న బాధితులు


వరద కాలువలోంచి నీటిని తీసుకువచ్చి ఇళ్లను శుభ్రం చేస్తున్న అగ్నిమాపక శాఖ, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు


మెట్లకింద పాము ఉండడంతో బయటకు పంపుతున్న కాలనీవాసి


జీఆర్‌కాలనీలో బురదను తొలగిస్తున్న మున్సిపల్ కార్మికులు


తాగేందుకు బాటిళ్లను తెచ్చుకుంటున్న బాధితులు


పోచమ్మ ఆలయం వద్ద కొట్టుకుపోయిన రోడ్డును చదును చేస్తున్న దృశ్యం

వరద వీడింది.. నష్టం మిగిలింది!

- వరద ప్రభావిత ప్రాంతాల్లో బురదమయం
- నీట మునిగిన ఇళ్లలో బురదతో బాధితుల ఇక్కట్లు
- బురదను తొలగించేందుకు నానా ఇబ్బందులు
- వరదతో కొట్టుకువచ్చిన కీటకాలు, పాములు
- సహాయక చర్యల్లో పాల్గొన్న మున్సిపల్, అగ్నిమాపక, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో వచ్చిన వరదలు తగ్గినా ప్రజల కన్నీళ్లు మాత్రం ఇంకా మిగిలే ఉన్నాయి. వరద ప్రభావిత ప్రాంతాలైన కామారెడ్డి పట్టణ కేంద్రంతో పాటు ఆయా గ్రామాలు, తండాల్లో ఎవరిని కదిలించినా కన్నీటి పర్యంతమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. నిమిషాల వ్యవధిలోనే వచ్చిన వరదతో ఇబ్బందులకు గురైన ప్రజలు మూడు రోజుల తర్వాత వరద మిగిల్చిన బురదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చరిత్రలో ఎప్పుడూ రానంత భారీ వర్షాలు కురవడం, వరదలు పోటెత్తడంతో లోతట్టు కాలనీలు, పరివాహక ప్రాంతాల ప్రజలు కట్టుబట్టలతో సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లారు. పలు బాధిత ప్రాంతాల్లో నడుము లోతు వరద నీరు ప్రవహించడంతో పూర్తిగా ఒకరోజు పాటు నీటిలో మునిగిపోయాయి. దీంతో బాధితులు ఇళ్లను శుభ్రం చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలోకి చేరిన బురదను తొలగించేందుకు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్, అగ్నిమాపక, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ఓ వైపు సహాయ సహకారాలు అందిస్తున్న ఇంట్లోని విలువైన వస్తువులు, డాక్యుమెంట్లు, సర్టిఫికెట్లు, పిల్లల పుస్తకాలు కొట్టుకుపోవడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు.

నిమిషాల వ్యవధిలో వరద చుట్టుముట్టింది



● శ్రీకాంత్, జీఆర్ కాలనీవాసి

తెల్లవారు జామున నుంచి వర్షం ఉన్నప్పటికీ వినాయక చవితి పండుగ సందర్భంగా పూజ సామగ్రి తీసుకుని వచ్చి పూజకు సిద్ధమవుతుండగా ఉదయం 11 గంటల ప్రాంతంలో వరద ఉధృతి పెరుగుతూ వచ్చింది. వరద పెరగడంతో ఎందుకైనా మంచిదని ఇంట్లో ఉన్న వారిని అప్రమత్తం చేసి మా బంధువుల ఇంట్లో దిగబెట్టి వచ్చిన నిమిషాల వ్యవధిలోనే వరద ఉధృతి నడుము లోతులోకి చేరింది. వరద వచ్చాక వచ్చిచూస్తే బురద నిండి ఇల్లంతా గందరగోళంగా తయారైంది. టీవీలు, ఇంట్లోని విలువైన సామగ్రి అంతా నాశనం అయింది.

ఇల్లంతా బురదతో నిండిపోయింది



● రాజేశ్వర్‌రావు, సిద్ధిరామేశ్వరాలయ పూజారి

వినాయక చవితి సందర్భంగా పూజ చేసుకునే ప్రయత్నంలో ఉండగా వరద ఉధృతి ఒక్కసారిగా పెరుగుతూ వచ్చింది. చూస్తుండగానే ఇంట్లోని డోర్ సగం వరకు నీరు పెరగడం మొదలైంది. దీంతో వెంటనే పై అంతస్తులోకి వెళ్లాం. కాలనీలో ఉన్న అందరు బిక్కుబిక్కుమంటూ బతకాల్సి వచ్చింది. ప్రాణాలు కాపాడుకున్నా ఆస్తినష్టం మాత్రం బాగానే జరిగింది. వరద తగ్గాక వస్తే ఇల్లంతా బురదతో నిండి పోయింది. పలువురి ఇళ్లలో పాములు, విషపు పురుగులు రావడంతో భయం భయంగా ఇంటిని శుభ్రపరుచుకున్నాం.

విలువైన వస్తువులు కొట్టుకుపోయాయి



● రమేష్, జీఆర్ కాలనీవాసి

వర్షాలు పడిన ప్రతీసారి కొద్ది వరకు మాత్రమే నీరు వచ్చేది. ఈ ఏడాది అదేవిధంగా ఉంటుందని భావించాం. కానీ వరద ఉప్పెనలాగా పెరుగుతూ రావడంతో ఏం చేయాలో తెలియక ఇబ్బందులు పడ్డాం. ఇంట్లోకి విలువైన వస్తువులు, డాక్యుమెంట్లు, పిల్లల పుస్తకాలు, సర్టిఫికెట్లు కొన్ని కొట్టుకపోగా మరికొన్ని పాడైపోయాయి.

సామాన్యులకు నష్టం చేకూర్చిన వరద

కామారెడ్డి పట్టణ శివారులోని హౌసింగ్ బోర్డు, జీఆర్ కాలనీ, అయ్యప్పనగర్, బతుకమ్మకుంట, సైలాన్ బాబాకాలనీ, టీచర్స్‌కాలనీ తదితర ప్రాంతాల్లోని సామాన్య మధ్య తరగతి ప్రజలకు వరదలు తీవ్ర నష్టాన్ని తెచ్చిపెట్టాయి. తెల్లవారితే వినాయక చవితి పండుగను ఎలా జరుపుకోవాలి అని ఆలోచిస్తు రాత్రి పడుకున్న వారికి బుధవారం తెల్లవారు జామున నుంచి పడిన భారీ వర్షంతో పాటు ఒక్కసారిగా పెరిగిన వరదతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బంగ్లాలపైన నిలుచుని బిక్కుబిక్కుమంటూ బతకాల్సి వచ్చింది.చివరకు పోలీసు, రిస్కుటీంల సహాయంతో వరద బాధితులు పునరావాస కేంద్రాలకు సురక్షితంగా తరలి ప్రాణాలను మాత్రం కాపాడుకున్నారు. కానీ ఆస్తి నష్టం మాత్రం బాగానే జరిగింది. కామారెడ్డి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నడుము లోతుకుపైగా వరద రావడం పరిస్థితి తీవ్రతకు అర్థం పడుతోంది. 24 గంటల పాటు సురక్షిత ప్రాంతాల్లో ఉన్న బాధిత కాలనీవాసులు వరద తగ్గడంతో నివాసాలకు చేరుకుంటున్నారు. కొందరు ఇంకా వేచిచూసే ధోరణిలో ఉన్నారు.

కన్నీరే మిగిలే..

వరద ఉధృతి తగ్గిన తర్వాత వారి సొంతింటికి వస్తున్న ప్రజలకు తమ ఇంటికి వచ్చిన తరువాత అక్కడ బురదమయమైన (మిగతా 8వ పేజీలో)

వరద నష్టం రూ.130 కోట్లు


భిక్కనూరులో నీట మునిగిన వరి పంట

- ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, మున్సిపల్ రోడ్లకు ఎక్కువ నష్టం
- రహదారుల ధ్వంసంతో రూ.83 కోట్లు
- 32,907 ఎకరాలల్లో పంటలకు నష్టం వాటిల్లింది
- యుద్ధ ప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులకు రూ.22 కోట్లు అవసరం
- వరద నష్టంను ప్రాథమిక అంచనా వేసిన ఆయా శాఖల అధికారులు
- ప్రభుత్వానికి నివేదించిన జిల్లా యంత్రాంగం

కామారెడ్డి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాను వరదలు తీవ్ర నష్టాన్ని చేకూర్చాయి. భారీ వర్షాలు వరదలు ప్రభుత్వ శాఖలకు చెందిన ఆస్తులు తీవ్రంగా ధ్వంసం కావడంతో నష్ట నివారణ అంచనాను అధికారులు లెక్కలు వేశారు. ప్రాథమికంగా సర్వే నిర్వహించిగా వంద కోట్లకు పైగానే నష్టం జరిగినట్లు గుర్తించారు. జిల్లావ్యాప్తంగా రూ.130 కోట్ల నష్టం జరిగినట్లు ఆయా శాఖల అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఇందులో ఎక్కువగా రోడ్ల ధ్వంసంతోనే నష్టం జరిగింది. వరదలతో ప్రధాన రహదారులు, చెరువులు, కుంటలు, విద్యుత్ కనెక్షన్లు, మంచినీటి వసతులు ధ్వంసం కావడంతో యుద్ధ ప్రతిపాదికన వాటి మరమ్మతులకు రూ.22 కోట్లు తక్షణమే అవసరమని నష్ట నివారణ అంచనాను సిద్ధం చేశారు. ఈ నివేదికను జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది.

రహదారుల ధ్వంసంతో రూ.83 కోట్లు నష్టం

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల పరిధిలో భారీ వర్షాలు, వరదల వల్ల తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వ రంగాలతో పాటు ప్రైవేటు ఆస్తులకు సైతం నష్టం వాటిల్లింది. ప్రధానంగా 13 ప్రభుత్వరంగాలకు ఆయా శాఖలకు చెందిన ఆస్తులు ధ్వంసం అయ్యాయి. జిల్లావ్యాప్తంగా 633 ప్రభుత్వ ఆస్తులకు రూ.130కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు జిల్లా యంత్రాంగం ప్రాథమిక అంచనా వేసింది. ఇందులో ప్రధానంగా రోడ్డు భవనాలు, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలకు చెందిన రోడ్లుకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. ఈ మూడు శాఖలకు సంబంధించి రోడ్లకు రూ.83 కోట్ల వరకు నష్టం జరిగింది. ఇందులో రోడ్డు భవనాల శాఖకు చెందిన 79 రోడ్లకు రూ.61 కోట్లు, పంచాయతీరాజ్ 48 రోడ్లకు రూ.11 కోట్లు, కామారెడ్డి మున్సిపల్ 104 రోడ్లకు రూ.13 కోట్లు నష్టం చేకూరింది. ఇరిగేషన్ శాఖకు చెందిన 93 చెరువులకు రూ.33 కోట్లు, పంచాయితీ, వైద్య ఆరోగ్య, విద్యాశాఖలకు సంబంధించినా ఆస్తులకు రూ.11 కోట్ల వరకు నష్టం జరిగినట్లు ఆయా శాఖల అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. అయితే వరదల తాకిడికి నష్టం జరిగిన ఆస్తులను పునరుద్ధరించి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టేందుకు రూ.22కోట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదించారు. 32,907 ఎకరాలలో పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేశారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్


44వ జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

కామారెడ్డి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వరదలు, వర్షాల కారణంగా 44వ జాతీయ రహదారిపై రెండు చోట్ల కుంగిపోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఎదురవుతోంది. దీంతో కిలో మీటర్ల పొడవున వాహనాలు నిలిచిపోతున్నాయి. హైదరాబాద్ నుంచి కామారెడ్డి మీదుగా ఆదిలాబాద్ వైపు వెళ్తున్న వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. దీంతో వాహనదారులు గంటలకు పైగా నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంటుంది. కామారెడ్డి పట్టణ శివారుల్లోని టెక్రియాల్, క్యాసంపల్లి 44వ జాతీయ రహదారి బ్రిడ్జిలు వరదల తాకిడికి కుంగిపోయి కోతకు గురయ్యాయి. దీంతో గురువారం నుంచి వాహనాలను ఆ మార్గం గుండా వన్‌వే ద్వారానే అనుమతిస్తున్నారు. గురువారం అర్ధరాత్రి నుంచి వాహనాలు పెద్దఎత్తున నిలిచిపోయాయి. హైదరాబాద్ నుంచి వచ్చే కొన్ని వాహనాలను వన్‌వే ద్వారా పంపుతూ నిజామాబాద్ నుంచి వచ్చే వాహనాలను నిలిపివేస్తున్నారు. మరికొద్ది సేపటికి హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలను నిలిపివేసి నిజామాబాద్ నుంచి వాహనాలకు అనుమతి ఇస్తున్నారు. దీంతో ఇరువైపులా సుమారు 10కి.మీల మేర భారీగా వాహనాలు నిలిచిపోతున్నాయి. గంటల తరబడి ట్రాఫిక్ జాం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు (మిగతా 8వ పేజీ తరువాయి)

బాధితులకు బాసటగా..


భిక్కనూరులో దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్

వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్

కామారెడ్డి టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాలను శుక్రవారం కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వర్షాలతో ముంపునకు గురైన జీఆర్‌కాలనీలో ప్రజల సాధారణ జీవనానికి ఇబ్బంది కలుగకుండా విద్యుత్, డ్రైనేజీ, తాగునీరు, రహదారుల పునరుద్ధరణ వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. పెద్ద చెరువును సందర్శించి శుద్ధి చేసిన నీటిని నిరంతరాయంగా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికవర్షాలతో దెబ్బతిన్న మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామం వద్ద రోడ్డు పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

భిక్కనూరు: అకాల వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఆదేశించారు. శుక్రవారం గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు భిక్కనూరు మండల కేంద్రంలో దెబ్బతిన్న రోడ్లను, తెగిన దాసనమ్మ కుంట కట్టను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా దాసనమ్మ కుంట కట్ట తెగి రోడ్డు ధ్వంసం కావడం, ఎల్లమ్మ ఆలయం వద్ద బ్రిడ్జి నీరు, మట్టితో నిండటంతో తమ కాలనీకి రాకపోకలు రెండు రోజులుగా నిలిచిపోయాయని తమను ఆదుకోవాలని గిద్ద హరిజనవాడ కాలనీ ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో కాలనీని వెంటనే సందర్శించి వారికి కావాల్సిన వసతులు కల్పించాలని తహసీల్దార్, ఎంపీడీవోను ఆదేశించారు. మండలంలో ఎలాంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి వెంటనే తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, తహసీల్దార్ సునీత, పీఆర్ ఏఈ దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి స్థానికులు పాల్గొన్నారు.


కామారెడ్డిలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న కలెక్టర్



సమస్యలపై గళం విప్పేనా?

- జిల్లాను అతలాకుతలం చేసిన వరదలు
- దెబ్బతిన్న రహదారులు
- యుద్ధ ప్రతిపాదికన నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేయాల్సిందే..
- వేల ఎకరాల్లో నీట మునిగిన పంటలు
- వందలాది మంది రైతులకు అపార నష్టం
- రైతన్నకు నష్టపరిహారం ఇప్పిచ్చేలా ప్రతినిధులు ప్రస్తావించాలి
- నేటి నుంచి ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు
- వరద నష్టం నివారణకు నిధులు కేటాయింపుపై ఎమ్మెల్యేలు లేవనెత్తాలి

కామారెడ్డి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలను నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలపై జిల్లాలోని వరద బాధితులు, రైతులు, ప్రజలు ఆశలు పెట్టుకుంటున్నారు. ఇటీవల భారీ వర్షాలు, వరదలకు జిల్లాను కోలుకోలేని దెబ్బతీసింది. వరదలు జిల్లాలో భారీ నష్టాన్ని చేకూర్చాయి. దాదాపు వందల కోట్లలోని నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిసింది. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వరదలు పోటెత్తడంతో ప్రధాన రహదారులు ధ్వంసం అయ్యాయి. జిల్లాలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఇతర ప్రాంతాలకు జిల్లా నుంచి సంబంధాలు తెగిపోయాయి. అదేవిధంగా నీటి వనరులైన చెరువులు, కాలువలు, ప్రాజెక్టులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇక అన్నదాత కోలుకోలేని విధంగా పంటలను వరదలు ముంచెత్తాయి. వేల ఎకరాల్లో పంటలు నీట మునగా వందలాది మంది రైతులకు అపార నష్టం వాటిల్లింది. దీంతో వరద నష్ట నివారణకు జిల్లా ఎమ్మెల్యేలు నిధులు రాబట్టేందుకు అసెంబ్లీ సమావేశాలు వేదికగానున్నాయి. అసెంబ్లీ సమావేశాల్లో జిల్లా ఎమ్మెల్యే లైనా పోచారం శ్రీనివాస్‌రెడ్డి, (మిగతా 8వ పేజీలో)


పోచారం శ్రీనివాస్‌రెడ్డి


వెంకట రమణారెడ్డి


మదన్‌మోహన్‌రావు


లక్ష్మీకాంతరావు

పంట పొలాలు, రోడ్ల పరిశీలన

వర్ని, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా వర్ని మండలంలో దెబ్బతిన్న పంట పొలాలు, రోడ్లను శుక్రవారం డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి పరిశీలించారు. వకీల్ ఫారం, శ్రీనగర్, జాకోర, కూనిపూర్, శంకోరా గ్రామాల్లో పర్యటించి రైతులకు భరోసా ఇచ్చారు. బాధితులకు అండగా ఉంటామని, రోడ్ల మరమ్మత్తు కు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు నామాల సాయిబాబా, కృష్ణా రెడ్డి, శ్రీనగర్ రాజు, నేమాని వీర్రాజు, రాజిరెడ్డి, వెలగ పూడి గోపాల్, గిరి తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలు పరిశీలించిన మానాల



రోడ్లను పరిశీలిస్తున్న మానాల మోహన్‌రెడ్డి

ఏర్గట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భారీగా కురిసిన వర్షాలకు బట్టాపూర్‌లోని పెద్దవాగు ఉధృతంగా ప్రవహించడంతో దెబ్బతిన్న రైతుల పంటలను శుక్రవారం రాష్ట్ర కోఆపరేటీవ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి పరిశీ లించారు. జరిగిన నష్టంపై రైతులను వివరాలు అడిగి తెలుసుకొని నష్ట పోయిన రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆడెం గంగాప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమ దేవ రెడ్డి, బాలె శ్రీనివాస్, రైతులు పాల్గొ న్నారు.

వేల్పూర్ : రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పలు రోడ్లను, పంటలను శుక్రవారం రాష్ట్ర కో-ఆపరేటీవ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పరిశీలించారు. రామన్నపేట్, వేల్పూర్ గ్రామాల మధ్య రోడ్డు పూర్తిగా తెగిపోయిన రోడ్డును ఆయన పరిశీలించారు. రోడ్లను, నష్టపోయిన పంటను మోహన్‌రెడ్డి ఫోటోస్ తీసుకుని నష్టానికి సంబందించి అంచనాలు ఉన్నతాధికారులకు నివేధించాలని అక్కడ ఉన్న అధికారులకు సూచించారు.

భీమ్‌గల్ : రెండు రోజులు కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్ల పనులకు ప్రణాళికలు సిద్ధం చేసి పనులను వెంటనే చేపట్టాలని రాష్ట్ర కో-ఆపరేటీవ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ అధకిఆరులకు సూచించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని కప్పల వాగు వద్ద వర్షం వల్ల కోతకు గురైన రోడ్డును, వంతెనను, నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈయన వెంట పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు స్వామి, నర్సయ్య, ఎస్సీసెల్ అధ్యక్షుడు పర్స అనంతరావు, నాయకులు కుంట రమేష్, కన్నె సురేందర్, మల్లే లక్ష్మణ్, గోపాల్ నాయక్, నాగేంద్ర, పార్టీ కార్యం

సుంకిని గ్రామంలోకి చేరిన వరద

కోటగిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు ఇళ్లలోకి చేరింది. పోతంగల్ మండలంలోని సుంకిని గ్రామంలో మంజీర నది ఒడ్డున ఉండడంతో వరద ఉధృతికి గ్రామంలోని పలు ఇళ్ల వద్దకు వరద నీరు చేరుకోవడంతో గ్రామస్థులు ఆందోళన చెందారు. మంజీర నదికి సమీపంలో ఉన్న ఇళ్ల ముందు భాగంలో వరద నీరు చేరుకోవడంతో అధికారులు ఇళ్లలో ఉన్న వారిని పునరావాస కేంద్రానికి తరలించారు. మధ్యాహ్నం నుంచి వరద ఉధృతి తగ్గడంతో గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు. గత 42ఏళ్ల క్రితం తమ గ్రామానికి వచ్చిన వరద మరోమారు రావడంతో గ్రామస్థులు ఆందోళన చెందారు. భారీ వర్షానికి మంజీర నది పరివాహక ప్రాంతాలలో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది, రహదారులు అధ్వానంగా మారాయి.

వరద ప్రాంతాలు పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



యంచలో నీటి ప్రవాహన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ అంకిత్



మిట్టాపూర్‌లో చేరిన వరద నీరు

నవీపేట,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టాపూర్, యంచ, అల్జాపూర్, కోస్లీ, బినోలలోని వరద ప్రాంతాలను శుక్రవారం అడిషనల్ కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. ఈ సందర్భంగా యంచ, అల్జాపూర్ గ్రామాల మధ్యన వరద నీటితో మూసుకుపోయిన రహదారిని ఆయన పరిశీలించారు. గోదావరి సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆయా గ్రామాల ప్రజలకు సూచించారు. వరద పరిస్థితిపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్, తహసీల్దార్ వెంకట రమణ, ఎంపీడీవో నాగనాథ్, ఎంపీడీవో రామకృష్ణ, ఏవో నవీన్ కుమార్, ఇరిగేషన్ ఏఈలు శ్రీధర్, ప్రణయ్ రెడ్డిలు ఉన్నారు.

జలదిగ్బంధంలో మిట్టాపూర్..

నవీపేట : మండలంలోని మిట్టాపూర్, యంచ పంచాయతీ పరిధిలోని అల్జాపూర్‌లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉగ్రరూపం దాల్చగా పరివాహక గ్రామాలైన మిట్టాపూర్, అల్జాపూర్‌లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో ఆయా గ్రామాలకు ఇతర గ్రామాల నుండి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మండలంలోని బినోల నుండి నిజాంపూర్ వెళ్లే రహదారిపై సైతం వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. యంచలోని జగదాద్రి ఆలయం వరకు వరద నీరు చేరింది. వరదల ప్రభావంతో మండలంలోని వివిధ గ్రామాలలో సుమారు 4500 ఎకరాల వరిపంట నీట మునిగిందని అధికారులు పేర్కొన్నారు.

కమ్మర్‌పల్లి : (ఆంధ్రజ్యోతి) గత రెండు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు రాజన్న సిరిసిల్లా జిల్లా రుద్రంగి మండలం బాల్కొండ నియోజకవర్గం పరిదిలోని మానాల గ్రామ సమీపంలోగల తాతమ్మ ఒర్రె పొంగి పొర్లుతుంది. గత ఏడాది భరీ వర్షాలు కురవడంతో శక్రవారం గుట్టలపై నుండి వచ్చిన వరద కారణంగా లోలెవల్ కాజ్‌పై పైనుండి ప్రవహిస్తున్నాయి. తగరెడు సంవత్సరాల క్రితం తాతమ్మ ఒర్రె లోలెల్ కాజ్‌వే పైనుండి వరద నీరు ప్రవహించడంతో రోడ్డు కొట్టుకు పోయి వారం రోజుల పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అయితే తాత్కలికల మరమ్మత్తులు చేపట్టిన అధికారులు రాకపోకలను పునరుద్దరించారు. ఆయితే తగ రెండు రోజులపాటు కురిసిన భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురై గ్రామస్తులు మల్లి అదే పరిస్థితులను ఎదుర్కొనాల్సి వస్తుంది. అధికారులు ట్రాకర్ అడ్డంగా పెట్టి రాకపోకలను నిలిపివేశారు ఈ రహదారి మీదుగానే గైదిగుట్ట తాండా గ్రామంమీదుగా మండలకేంద్రమైన రుద్రంగి, కోరుట్ల, పవిత్ర పుణ్యక్షేత్రం వేములవాడ జిల్లా కేంద్రమైన సిరిసిల్లాకు వెల్లాల్సి ఉంటుంది. ప్రతీ వర్షాకాలం అదేపరిస్థితిని ఎదుర్కుటున్నామని గ్రామస్తులు వాపోతున్నారు.

జక్రాన్‌పల్లి : మండలంలో కురిసిన భారీ వర్షాలకు గ్రామాల్లో చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. రామడుగు ప్రాజెక్టు అలుగు పారుతుంది. దీంతో కలిగోట్, చింతలూర్ వాగులో చెక్‌డ్యాం ఉధృతంగా పారుతుంది. చింతలూరు వైపు చెక్‌డ్యాం పక్కన మట్టికట్ట కోతకు గురైంది. ఈ చెక్‌డ్యాం నుంచి వేల్పూర్ మండల పచ్చల నడ్కుడ చెరువుకు వెళ్లే మాటు కాలువ తూము షేటారు కొట్టుకుపోయింది. శుక్రవారం ఇరిగేషన్ ఎస్ఈ రామరావు, ఇరిగేషన్ క్వాలిటి ఈఈ దత్తాద్రి, పంచాయితీ కార్యదర్శులు అధికారులు కలిసి చింతలూర్ చెక్‌డ్యాం వైపు మట్టికట్ట కోతకు గురికాగా వారు పరిశీలించారు. మండలంలోని పడకల్, కేశ్‌పల్లి పెద్ద చెరువు అలుగు పారుతుంది. అర్గుల్ పలు చెరువు అలుగు పారుతుంది.

ఏర్గట్ల : భారీగా కురుస్తున్న వర్షాలకు గోధావరి తీర ప్రాంతాల్లోని పంట పోలాలు పూర్తి నీటితో నిండిపోయాయి. వ్యవసాయాశాఖ అధికారులు మండలంలోని గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి దాదాపు 660 ఎకరాల పంట నీటి మునిగి పాడాయ్యాయని అంచానా వేశారు. పంట నష్టం వివరాలను పై అధికారులకు పంపిస్తామని మండల వ్యవసాయశాఖ అధికారి వైష్ణవ్ తెలిపారు. అలాగే గోదావరి తీర ప్రాంతమైన తడపాకల్‌ను ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిష్యాన్ మాల్వియా పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు.



భారీ వర్షాలకు పొంగి పొర్లుతున్న మానాల తాతమ్మ ఒర్రె



తడపాకల్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఆర్మూర్ సబ్ కలెక్టర్

భారీ వాహనాల రోడ్ల మళ్లింపు



పెర్కిట్ చౌరస్తా వద్ద వాహనాలను మళ్లిస్తున్న పోలీసులు

ఆర్మూర్ టౌన్ , ఆగస్టు 3, (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ చౌరస్తా వద్ద స్థానిక పోలీస్‌లు భారీ వాహనాల రోడ్ల మళ్లింపును చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కామారెడ్డి ప్రాంతంలో రోడ్లు పూర్తిగా ధ్వసం కావడంతో ఆర్మూర్ మీదుగాహైదరాబాద్ వెళ్తున్న భారీ వాహనాలను మెట్‌పల్లి, కోరుట్ల, కరీంనగర్ మీదుగా హైదరాబాద్‌కు తరలించారు.

మండల పరిషత్ కార్యాలయం తనిఖీ

కమ్మర్‌పల్లి, ఆగస్టు 29: (ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సాయన్న ఆకస్మిక తనికి చేశారు. ఈసందర్భంగా మండలంలోని మండల ప్రాదేశిక (ఎంపీటీసీల) సభ్యుల ఆన్‌లైన్ మ్యాపింగ్ పనులను ఆయన కంప్యూటర్‌లో స్వయంగ పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని వార్డులవారిగా ఓటర్ల పేర్లను చేర్చిన వివరాలను, పోలింగ్ బూత్‌ల వివరాలను స్థానిక ఎంపీడీవో రాజా శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. మండల పంచాయితీ అధికారి సదాశివ్, మండలసీనియర్ అసిస్టెంట్‌లు అమృత్ రావు, శివకుమార్ టైపిస్టు సంతోష్ కుమార్ ఉన్నారు.

పొంగి పొర్లుతున్న చెక్‌డ్యాంలు

వేల్పూర్, ఆగస్టు 3, (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్దవాగు, కప్పల వాగులపై నిర్మించిన చెక్‌డ్యాంలు వరద నీటితో పొంగి ప్రవహిస్తున్నాయి. పెద్దవాగులో జాన్కంపేట్ గ్రామ సమీపంలోని బీరప్ప ఆలయం వద్ద, పచ్చల నడ్కుడ బ్రిడ్జి సమీపంలో, వేల్పూర్ బ్రిడ్జి సమీపంలో అలాగే మోతె గ్రామ కప్పల వాగు బ్రిడ్జి సమీపంలో నిర్మించిన చెక్‌డ్యాంలు పూర్తిస్థాయిలో పొంగి ప్రవహిస్తున్నాయి.

కోతకు గురైన రోడ్లు



వర్షాలకు పాడైనపోయిన రుద్రూరు రోడ్డు

రుద్రూరు,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు కోతకు గురయ్యాయి. రోడ్లు ధ్వంసం అవుతుండడంతో ప్రయాణం సాగించే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లకు మరమ్మత్తులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్ల పరిశీలన

వర్ని, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా వర్ని మండలంలో దెబ్బతిన్న పంట పొలాలు, రోడ్లను శుక్రవారం డిసిసిబి మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పరిశీలించారు. వకీల్ ఫారం, శ్రీనగర్, జాకోర, కూనిపూర్, శంకోరా గ్రామాల్లో పర్యటించి రైతులకు భరోసా ఇచ్చారు. బాధితులకు అండగా ఉంటామని, రోడ్ల మరమ్మత్తు కు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు నామాల సాయిబాబా, కృష్ణా రెడ్డి, శ్రీనగర్ రాజు, నేమాని వీర్రాజు, రాజిరెడ్డి, వెలగ పూడి గోపాల్, గిరి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బియ్యం పంపిణీ

కోటగిరి,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని సుంకిని గ్రామంలో వరద బాధిత కుటుంబాలకు శుక్రవారం బీజేపీ నాయకులు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ బియ్యం బస్తాలను పంపిణీ చేశారు. సుంకిని గ్రామంలో వరద ప్రవాహంలో దెబ్బతిన్న పంట పొలాలను, నీట మునిగిన కాలనీల్లో ఆయన పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకునేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆయన వెంట పోతంగల్ మండల బీజేపీ నాయకులున్నారు.

కోతకు గురైన నాళేశ్వర్, తల్వేద బ్రిడ్జి

నవీపేట,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్, నందిపేట మండలం తల్వేద గ్రామాల మధ్యన ఉన్న బ్రిడ్జి కోతకు గురైంది. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పెద్ద ఎత్తున నీటి ప్రవాహం పెరగడంతో నాళేశ్వర్ వైపున ఉన్న బ్రిడ్జి పక్క భాగం కోతకు గురైంది. కోతకు గురైన బ్రిడ్జి భాగాన్ని వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని గ్రామానికి చెందిన పలువురు నాయకులు అధికారులను కోరారు. భారీ వర్షాలకు నీటి ప్రవాహం పెరగడంతో గ్రామ శివారులో ఉన్న వరిపంట నీట మునిగింది.

పోతంగల్‌లో 2,400 ఎకరాల్లో పంట నష్టం

కోటగిరి,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 2,400 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయ అధికారిణి నిశిత తెలిపారు. పోతంగల్ మండలంలోని సోంపూర్, హుమ్నాపూర్, కారేగాం, హంగర్గ, సుంకిని, పోతంగల్ గ్రామాలలో దెబ్బతిన్న పంటలను శుక్రవారం వ్యవసాయ అధికారిణి పరిశీలించారు. పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ఆమె వెంట ఏఈవో సుప్రియ, రైతులు తదితరులు ఉన్నారు.

పొలాల పరిశీలన

సాలూర,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): సాలూర మండలంలోని మంజీర పరివాహక ప్రాంతాలలో ఉన్నటువంటి వరదలకు ముంపునకు గురైన పంట పొలాలను సాలూర వ్యవసాయ అధికారి శ్వేత, ఎంపీడీవో శ్రీనివాస్‌లు పరిశీలించారు. గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు హున్స, మందర్నా., ఖాజాపూర్ గ్రామాలలో పంట నష్టం అధికంగా వాటిల్లినట్లు వారు పేర్కొన్నారు. పంట నష్ట వివరాలను అంచన వేస్తున్నామన్నారు. సోయాపంట 2820 ఎకరాలు, వరిపంట 3110 ఎకరాలు వరకు నష్టం వాటిల్లినట్లు అంచన వేశామన్నారు. అంచన వేసిన పంట నష్ట వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వం నిర్ణయం మేరకు రైతులకు పంట నష్టపరిహారం అందించడం జరుగుతుందని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

తాడ్‌బిలోలి, బోర్గాం మధ్య నిలిచిన రాకపోకలు

రెంజల్,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): గత రెండు, మూడు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు తాడ్‌బిలోలి, బోర్గాం మధ్య రోడ్లపై రాకపోకలు నిలిచిపోయాయి.. ఎన్‌హెచ్ 161బీబీ పూర్తిగా నీట మునిగిపోవడంతో బైంసా నుండి బోధన్ వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. బోర్గాం నుండి తాడ్‌బిలోలి వెళ్లే రోడ్డు అధిక నీటి ప్రవాహంతో రాకపోకలు స్తంభించాయి. ఇటువైపుగా ప్రజలు రాకూడదని అధికారులు వాహనాలను దారి మళ్లించారు. అధిక నీటి ప్రవాహం ఎక్కువ అవ్వడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎస్ఐ చంద్రమోహన్‌లు బారికేడ్లను ఏర్పాటు చేసి వాహనాలను దారి మళ్లించారు. ఏమైన సమస్యలుంటే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.



నిలిచిన రాకపోకలు

క్రైం సమాచారం

కెనాల్‌లో పడి వ్యక్తి మృతి

సుభాష్‌నగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నిజాంసాగర్ కెనాల్‌లో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. 6వ టౌన్ ఎస్‌హెచ్‌వో వెంకట్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. నగర శివారులోని డెయిరీ ఫామ్ కమాన్ వద్ద ఉన్న నిజాంసాగర్ కెనాల్‌లో శుక్రవారం గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. కాలువలో పడి మృతిచెందిన వ్యక్తికి సుమారు 40 ఏళ్లు ఉంటాయని, ఆనవాళ్లు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా మృతుడి సమాచారం తెలిస్తే 6వ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

మోర్తాడ్, ఆగస్టు 3, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భగత్‌సింగ్ కాలనీలో చోరీ చేసిన నిందితుడిని అరెస్టు చేశామని సీఐ సత్యనాయణ తెలిపారు. మండల కేంద్రంలో భగత్‌సింగ్ కాలనీకి చెందిన అమృతరావు ఇంట్లో నాలుగురోజుల క్రితం గుర్తుతెలియని దొంగలు తాళం తీసి ఇంట్లోకి ప్రవేశించి 9 మాసాల బంగారాం, ఐదువేల రూపాయలు దొంగిలించారని సీఐ తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశామని శుక్రవారం మోర్తాడ్‌కు చెందిన ఎర్ల అశోక్ ను అరెస్టు చేసి దొంగిలించిన బంగారంను రికవరీ చేసి జైలుకు పంపామని తెలిపారు. సమావేశంలో మోర్తాడ్ ఎస్సై రాము, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడికి గాయాలు

ఎడపల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):మండలంలోని సాటాపూర్ గేటు సమీపంలో బోధన్-నిజామాబాద్ ప్రదాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో బోధన్ పట్టణానికి చెందిన షేక్ అన్సార్ అనే యువకుడికి గాయాలు అయినట్టు ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం బోధన్ పట్టణానికి చెందిన షేక్ అన్సార్ అనే యువకుడు తన ద్విచక్రవాహనంపై నిజామాబాద్ వెలుతుండగా సాటాపూర్ గేటు వద్ద డివైడర్‌ను ఢీ కొట్టడంతో అతనికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కోస్లీలో కోళ్ల మృతి

నవీపేట,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ శివారులో గురువారం రాత్రి కోళ్ల ఫారం వరద నీటిలో మునిగిపోయింది. గ్రామానికి చెందిన హరీష్ కుమార్ కోళ్ల ఫారంలో సుమారు 9వేల వరకు కోళ్లు ఉన్నాయి. అర్ధరాత్రి సమయంలో ఆకస్మాత్తుగా వరదలు రావడంతో కోళ్ల ఫారం పూర్తిగా నీట మునిగింది. కోళ్ల ఫారంలో ఉన్న 9వేల కోళ్లు మృతి చెందాయని దీంతో సుమారు 15లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు హరీష్ కుమార్ పేర్కొన్నాడు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సాలూర,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): సాలూర శివారులోని మంజీర ఒడ్డుపై ఉన్న పిల్ల కాలువలో శుక్రవారం మృతదేహం లభ్యమైనట్లు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. శవ పంచనామా నిర్వహించారు. విచారణ అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు.

విద్యుత్‌షాకుతో రెండు గేదెలు మృతి

మెండోర , ఆగస్టు 3, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోన్‌పేట్ గ్రామానికి చెందిన రైతుల రెండు గేదెలు విద్యుత్ షాక్‌తో మృతిచెందినట్లు ట్రాన్స్‌కో ఏఈ అజ్మద్ పాషా తెలిపారు. ఈ సందర్భంగా సోన్‌పేట్ గ్రామానికి చెందిన దంతే లక్ష్మీ, ధోని లత రైతులకు చెందిన రెండు గేదెలు అమ్రాయి కాలనీలో విద్యుత్ షాక్‌తో మృతి చెందాయని సుమారు గేదెల ఖరీదు లక్ష రూపాయల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

కంజర్‌లో యువతి ఆత్మహత్య

మోపాల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కంజర్ గ్రామానికి చెందిన అక్షయ (20) అనే యువతి శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ సుష్మిత సంఘటన స్థలనికి చేరుకుని యువతి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. యువతి నిజామాబాద్‌లో నర్సింగ్ కోర్సు చదువుతుంది. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. యువతి తల్లి ఇటీ వలే మరణించింది. ఆమె అమ్మమ్మ దగ్గర ఉంటుంది. ఇంట్లో ఎవరు లేని సమయంచూసి దూలానికి ఉరి వేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

గల్లంతైన బాలరాజు మృతదేహం లభ్యం

● రెండు రోజులకు దొరికిన ఆచూకీ



బాలరాజు మృతదేహాన్ని మోసుకుని వస్తున్న ఏఎస్సై, గ్రామస్థులు

దోమకొండ,(బీబీపేట) ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):దోమకొండ- సంగమేశ్వర్ గ్రామాల మధ్యలో వాగు ప్రవాహానికి కొట్టుకుపోయిన సంగమేశ్వర్ గ్రామానికి చెందిన గోత్రాల బాలరాజు(42) మృతదేహం శుక్రవారం పంటపొలాల్లో లభ్యమైంది. వరద తగ్గడంతో అటుగా వ్యవసాయబావుల వద్దకి వెళ్లిన రైతులకు కంటబడటంతో వెంటనే స్థానిక ఎస్సై స్రవంతికి సమాచారం అందించారు. సిబ్బందితో ఆమె అక్కడకు చేరుకుని మృతదేహన్ని బయటకు తెచ్చేందుకు చాలా ఇబ్బందులు పడ్డారు. రోడ్డు నుంచి 1 కిలోమీటర్‌కు పైగా దూరం కొట్టుకుపోయిన బాలరాజు మృతదేహం రోడ్డుకు తీసుకురావడానికి ఏఎస్సై జానీపాషా మరో ముగ్గురు గ్రామస్తులతో కలసి అతికష్టం మోసుకుంటూ రోడ్డుకు తెచ్చారు. అనంతరం మతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రి కామారెడ్డికి తరలించారు. మృతునికి భార్య రూప, ఇద్దరు పిల్లలు రుత్విక్(17) సాకేత్(09) ఉన్నారు. తహసీల్దార్ సుధాకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

● **రైతులను కంటతడి పెట్టించిన భారీ వర్షం**

మండలంలోని సంగమేశ్వర్, గొట్టిముక్కుల,అంచనూర్, దోమకొండ, బీబీపేట మండలంలోని మాందాపూర్, జనగామ, బీబీపేట, ఉప్పర్‌పల్లితో పాటు ఆయా గ్రామాల్లో వందల ఏకరాల్లో పంటలు వరద దాటికి పూర్తిగ కొట్టుకుపోయింది. దీంతో రైతులు కంటతడి పెట్టుకున్నారు. చేతికి వస్తుందన్న పంటలు రాత్రికిరాత్రే నేలమట్టం కావడంతో రైతులు దిగులు చెందుతున్నారు. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని దోమకొండ, బీబీపేట మండలాలు రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

● **మన్నే పోచయ్య రైతు**



సంగమేశ్వర్ రోడ్డులో నా వ్యవసాయ పొలం వద్ద రేకుల షెడ్డు వేసి అందులో ఆవులను పెంచుతున్నాను. భారీ వర్షం కురియడం తో షెడ్డుతో పాటు అందులో కట్టివేసిన 8 ఆవులు కొట్టుకుపోయి మృతి చెందాయి. దీంతో రూ.6 లక్షల వరకు నష్టం జరిగింది. నన్ను ప్రభుత్వం ఆదుకోవాలి.

వరి పంట మొత్తం నేలమట్టం అయింది

● **నత్తి నవీన్, రైతు గొట్టిముక్కుల**



ఎడ్ల కట్ట వాగు ప్రవహం వలన మూడు ఎకరాల్లో వరి పంట నేల మట్టం అయింది. లక్ష్మీదేవునిపల్లి గ్రామ శివారులో కౌలుకు తీసుకుని చేస్తున్న పంట పూర్తిగా దెబ్బతింది. పెట్టుబడి పెట్టి పంట ఒక దశకు వచ్చే స్థాయికివాగులో కొట్టుకుపోయింది. అధికారులు సర్వే నిర్వహించి మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

ఇంతటి స్థాయిలో ఎపుడు చూడని వాగు

● **శ్యాంరెడ్డి, రైతు**



గత 100 సంవత్సరాల నుంచి కూడా ఇంతటి వాగు ఉధృతి రాలేదని గ్రామ పెద్దలు చెపుతున్నారు. ఇంతటి ప్రవహాన్ని ఎపుడు చూడలేదు. బిక్కనూర్, లక్ష్మాపూర్, దంతేపల్లి మీదుగా భారీ వర్షం కురియడం వలన గొట్టిముక్కుల, సంగమేశ్వర్, మాందాపూర్, బీబీపేటకు పెద్ద ఎత్తున వాగు పారింది. దీంతో రోడ్లు తేగిపోయాయి. పంటలు నీటికి కొట్టుకుపోయాయి.

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి

కోటగిరి,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలకు పంట పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పోతంగల్ మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముందు మండలంలోని సుంకిని, పోతంగల్, కారేగాం గ్రామాలలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. సుంకినిలో మంజీర వరద నీరు గ్రామాల్లోకి చేరడంతో గ్రామస్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ రావు, కిషన్, రవి, నవీన్, అఖిం, శ్రీనివాస్ గౌడ్, సంతోష్, నజీర్, యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

రెంజల్,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి అధికంగా కురుస్తున్న వర్షాలకు గోదావరి ప్రాంత ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు నీట మునిగి తీవ్ర నష్టం జరిగిందని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్ రెడ్డి, మేడపాటి ప్రకాష్ రెడ్డిలు అన్నారు. శుక్రవారం మండలంలోని నీలా, కందకుర్తి గ్రామాలలో నీట మునిగిన పంటలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటలు పూర్తిగా జలమయమవ్వడంతో రైతులకు నష్టాన్ని మిగిల్చాయని, నష్టపోయిన రైతులకు ఎకరాకు 30వేల నష్ట పరిహారం అందించి, రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు యోగేష్, మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు మేక సంతోష్, ప్రసాద్ బాబు, యోగేష్, రమేష్, శ్రీను, శివ, కూరెళ్ల శ్రీధర్, అంతయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీ.మోహన్ రెడ్డి శుక్రవారం మండలంలోని కోస్లీ, యంచ, నందిగామ గ్రామాలలో నీట మునిగిన పంట పొలాలతో పాటు వరద ప్రాంతాలను సందర్శించారు. వరదల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తగిన పరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో శైలేష్ కుమార్, రమణ రావు, భూషణ్, రాజేందర్ గౌడ్, నాగభూషణ్, సందీప్, రాము, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతులకు తప్పని ఇబ్బందులు

జక్రాన్‌పల్లి, ఆగస్టు 3, (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కోసం రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. యూరియా దొరకకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం మండలంలోని పడకల్ గ్రామంలో ఎరువుల గోదాం వద్ద యూరియా కోసం రైతులు తమ వెంట తెచ్చుకున్న ఆధార్, పాస్‌బుక్ జిరాక్స్‌లను క్యూలో పెట్టారు. వర్షాలు కురుస్తునందున పంట పొలాలకు యూరియా అవసరం ఉందని రైతులు తెలిపారు. ప్రస్తుతం వరి పంటకు యూరియా అవసరం ఉందని రైతులకు సరిపడా యూరియా దొరకడం లేదని రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబందిత అధికారులు స్పందించి రైతులు ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని సకాలంలో యూరియా అందించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

తడి పొడి చెత్తపై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

ఆర్మూర్ టౌన్ , ఆగస్టు 3, (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 28, 32 వ వార్డులలో మున్సిపల్ అధికారులు తడి పొడి చెత్తపై మహిళలకు అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరుగుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వాడవద్దని సీజనల్ వ్యాధులపట్ల, వీధి కుక్కల పట్ల జాగ్రత్తలు వహించాలని సూచించారు. కార్యక్రమంలో సానిటరి ఇన్‌స్పెక్టర్ నరేందర్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, రాజేశ్, నీలిమ పాల్గొన్నారు.

మూడు గ్రామాలలో డ్రై డే

వేల్పూర్, ఆగస్టు 3, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోతె, రామన్నపేట్, పచ్చల నడ్కుడ గ్రామాలలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగానే సానిటేషన్ పనులను చేపట్టి మురికి కాలువలను శుభ్రం చేస్తు బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ, మురికి నీరు నిల్వకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు.



మాసాని చెరువు గేట్లపై నుంచి వస్తున్న నీరు

నిండిన చెరువులు

మోపాల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో చెరువులు నిండుకుండల్లాగా నిండాయి. ఇటీవల కురిసిన వర్షాలతో మండలంలోని మంచిప్ప, కులాస్‌పూర్, కొండెం చెరువు, మాసాని చెరువు, ఖజానా చెరువులు నిండు కుండల్లాగా నిండాయి. ఎన్నో సంవత్సరాల తర్వాత ఈ చెరువుల ఇంత పెద్ద ఎత్తున నిండటం ఇదే తొలిసారి అని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు తెలిపారు. మండలంలోని న్యాల్‌కల్ గ్రామంలో ఉన్న మాసాని చెరువు నిండి గేట్లపై నుం చి పారుతుంది. వీటిని కూడటానికి గ్రామస్థులే కాకుండా నగర ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్తున్నారు. చెరువుల పరిస్థితులను ఎప్పటికప్పుడు ఇరిగేషన్ అధికారులు తెలుసుకుంటున్నారు.

పునరావాస కేంద్రంలో దుప్పట్ల పంపిణీ

నిజాంసాగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలం గోర్గల్ గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో శుక్రవారం పిట్లం, నిజాంసాగర్ మండలాల బీజేపీ నాయకులు మర్పల్లి గ్రామానికి చెందిన 60 మందికి దుప్పట్లను పంపిణీ చేశారు. ఎంపీ బీబీ పాటిల్ తరఫున మరింత సహాయం అందించేందుకు కృషి చేస్తామని బీజేపీ నియోజకవర్గ నాయకుడు బత్తిని జగదీష్ మధ్యలో నవీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాయి రెడ్డి, నరేష్, అశోక్‌రాజ్, రాజు, రవిచంద్ర, ఎర్ర రమేష్ రామ్ రెడ్డి పాల్గొన్నారు.



నిర్వాసితులకు దుప్పట్లు అందజేస్తున్న నాయకులు



కొనసాగుతున్న నిజాంసాగర్ వరద గేట్లు



నిజాంసాగర్ నీటిని ఆస్వాదిస్తున్న సందర్శకులు

నిజాంసాగర్‌కు తగ్గని వరద ఉధృతి

నిజాంసాగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టులోనికి వరద నీరు ఉధృతంగా వస్తూనే ఉంది. మంజీరా నది వెంట వచ్చే వరద నీటిని నీటిపారుదల శాఖ అధికారులు ప్రాజెక్టు 23 వరద గేట్లను ఎత్తి శుక్రవారం నాటికి ఎగువ నుంచి వచ్చే లక్ష 67 వేల 944 క్యూసెక్కుల వరద నీటిని మంజీరా నదిలోకి వదిలి వేస్తున్నారు. మంజీరా నది పరివాహక ప్రాంతంలో ప్రాంతంలో కుడి ఎడమ పక్కన ఉన్న వరి పైర్లు వరద నీటిలో తొణికిసలాడుతున్నాయి. నిజాం సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 1,405 అడుగులు కాగా, ప్రస్తుతం 1402.78 అడుగులకు చేరింది. ప్రాజెక్టు సామర్థ్యం 17.802 టీఎంసీలు కాగా, 14.697 టీఎంసీ నీరు నిల్వ ఉంది. ఈనెల 18వ తేదీ నుంచి 23 గేట్లు ఎత్తి మంజీర నదిలోకి విడుదల చేస్తున్నారు.

ఆదర్శ బాలికలు కేజీబీవీకి తరలింపు



ఆదర్శ హాస్టల్ పిల్లలను కేజీబీ తరలిస్తున్న దృశ్యం

నిజాంసాగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌లో విద్యాభ్యాసం చేస్తూ ఆదర్శ హాస్టల్లో ఉంటున్న విద్యార్థులను వర్షా భావ పరిస్థితి శుక్రవారం అధికారులు హాస్టల్ బాలికలను కస్తూర్బా విద్యాలయానికి తరలించారు. జవహర్ నవోదయ మోడల్ స్కూల్ చుట్టూ వరదనీరు ఉండడంతో మోడల్ స్కూల్ హాస్టల్‌లో విద్యుత్, తాగునీటి సరఫరా నిలిచిపోయింది. హాస్టల్ పాఠశాలకు రాకపోకలు నిలిచిపోయాయి ఐదు రోజులగా హాస్టల్ బాలికలు బిక్కుబిక్కుమంటూ హాస్టల్లోనే ఉండిపోయారు. నాలుగు రోజులుగా భారీ వర్షాలు తెలియడంతో హాస్టల్లో కరెంటు నిలిచిపోవడంతో బాలికలు ఆందోళన చెందారు. ఎట్టకేలకు విఆర్ నెంబర్ 5లోని వరద గేట్లను తగ్గించడంతో నవోదయ సమీపంలో ఉన్న చిన్న పూలు వంతెన వరద నీటిలో నుంచి తేలుకోలేకపోయింది. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధులు హాస్టల్లో ఉన్న 90 మంది బాలికలు మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయానికి తరలించారు.

బాన్సువాడ డివిజన్‌లో 99 ఇళ్లు పాక్షిక నష్టం

- బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి



ఎస్‌డీఆర్‌ఎఫ్‌లతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

నిజాంసాగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ డివిజన్ పరిధిలోని మండలాల్లో భారీ వర్షాలు 99 ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని సబ్ కలెక్టర్ కిరణ్మయి తెలిపారు. శుక్రవారం శ్రీరాంసాగర్ ఫైసల్ కార్యాలయంలో ఎస్డిఆర్ఎఫ్ రిస్క్యూ టీం సభ్యులతో ఆమె మాట్లాడారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో నిజాంసాగర్ మండలంలో పునరావస కేంద్రానికి తరలించడం జరిగిందన్నారు. వారికి అన్ని వసతులు కల్పిస్తూ వైద్య సేవలు కూడా అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. మహమ్మద్ నగర్ మండలంలోని తుగ్గపల్లి గ్రామంలో వర్షపు నీరు రావడంతో కొన్ని కుటుంబాలను పాఠశాల ఏర్పాటుచేసి పునరావస కేంద్రానికి తరలించడం జరిగిందని ఆమె అన్నారు. ఆరేపల్లిలో ఓ కుటుంబం ఇల్లు కూలిపోవడంతో పాఠశాలల్లో వసతి కల్పించామన్నారు. జవహర్ నవోదయ ఆదర్శ పాఠశాల హాస్టల్ పిల్లలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పాఠశాలకు నిలిచిపోయిన విద్యుత్, తాగునీటి సరఫరాను చర్యలు చేపడుతున్నామని ఆమె అన్నారు. ఆదర్శ పాఠశాల బాలికలను కస్తూర్బా విద్యాలయానికి తరలించామన్నారు. హాజీపూర్ చెరువు గండిపడడంతో 15 కుటుంబాలను 15 కుటుంబాలలోని 36 మందిని నెమలి పాఠశాలలో ఆశ్రమ కల్పించామని ఆమె అన్నారు. లింగంపల్లి గ్రామ వరద చుట్టుపట్టడంతో కొన్ని కుటుంబాలను పాఠశాలలో ఆశ్రయం కల్పించినట్లు ఆమె వెల్లడించారు. పురావస కేంద్రంలో ప్రజలకు అన్ని వసతులు నిజాంసాగర్ మండలంలో 51 గృహాలు పాక్షికంగా కూలినట్లు ఆమె తెలిపారు.

పొంగిపొర్లుతున్న కోనాపూర్ రాళ్లవాగు ప్రాజెక్ట్



పొంగిపొర్లుతున్న కోనాపూర్ రాళ్లవాగు ప్రాజెక్ట్



రాళ్లవాగు జలాశయం వద్దకు శుక్రవారం మధ్యాహ్నం చేరుకున్న సందర్శకులు

- రాళ్లవాగుకు సందర్శకుల తాకిడి
- సదుపాయాలు కల్పించాలని వినతి

కమ్మర్‌పల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షాలు లేక చెరువులు, కుంటలు వెలవెలబోతుండగా రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల కు పొంగిపొర్లుతున్నాయి. కొండాకోనలు, గుట్టల నుం చి జాలువారిన నీటితో ఓ వైపు గట్టు పోడిచిన వాగు నిండి పొంగిపొర్లుతుండగా బుధ,గురువారాలు ఎకధాటిగా కురిసిన సుమారు 10 సెంటీమీటర్ల (112. 2 మి.మీ) వర్షానికి మండంలోని కోనాపూర్ రాళ్లవాగు మత్తడి పోర్లుతుంది. 20 రోజులుగా అడపా దడప కురుస్తున్న ముసురువర్షాలకు కొద్దికొద్దిగా రాళ్లవాగు ప్రాజెక్ట్‌లోకి వరదనీరు వచ్చి చేరుతుండగా గట్టుపోడిచిన వాగు పొంగిపొర్లడంతో పాటు రెండు రోజులు కురిసిన భారీ వార్షానికి రాళ్లవాగు ప్రాజెక్ట్ శుక్రవారం తెల్లవారుజామునుంచి మత్తడి పొంగి పొర్లింది. వరుసగా వానలు ముసురురూపంలో కురుస్తుండడంతో మండలంలోని నర్సాపూర్, ఇనాయత్‌నగర్ గ్రామాల మద్య అటవి ప్రాంతంలో నిర్మించిన గట్టుపొడియిన వాగు గత 2 రోజులక్రితం నిండు కుండల మారి మత్తడి పై నుంచి రాళ్లవాగు ప్రాజెక్ట్ వైపు పరుగులు తీశాయి. దీనితో శుక్రవారం మండలంలోని మారుమూల గ్రామం కోనాపూర్ రాళ్లవాగు పొంగి పొర్లింది. మంగళవారం వరకు మండలంలోని దాదాపు ఏ చెరువులోను కుంటల్లో 60 శాతం కుడ నీరు చేరకపోగా గట్టుపొడిచినవాగు, రాళ్లవాగు ప్రాజెక్ట్ పొంగిపొర్లుతుండడంతో రైతుల్లో ఆనందం వెల్లువిరుస్తుంది. ఈ సారి మొన్నటివరకు అంతగా భారీ వర్షాలు లేకపోయినా చెరువుల్లోకి నీరు చేరకపోయినా గుట్టలప్రాంతంలోని రాళ్లవాగు ఉప్పొంగి ప్రవహించింది. రాళ్లవాగు పొంగడంతో రైతుల్లో ఆశాలు చిగురించాయి. ఈ ప్రాజెక్ట్ నుంచి కుడి ఎడమ కాలువల ద్వారా కోనాపూర్‌కు చెందిన 7వందల ఎకరాలకు, జగిత్యాల జిల్లా కథలాపూర్, భూషన్‌రావుపేట్, పెగ్గెర్ల, ఊట్‌పెల్లి గ్రామాలకు చెందిన సుమారు 2 వేల 8 వందల ఎకరాలకు కుడి కాలువ ద్వారా ఈ పాజెక్ట్ సాగునీరందిస్తుంది. కాగా వరుణుడు కరునించడంతో పంటలుగట్టెక్కనట్లేనని ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాళ్లవాగుకు మొదలైన సందర్శకుల తాకిడి

కొన్నేళ్లుగా ఆగస్టు మొదటివారంలోనే రాళ్లవాగు ప్రాజెక్ట్ పొంగిపొర్లుతుండేది. రెండేళ్ల క్రితం నిండు కుండలా మారిన ఈ ప్రాజెక్ట్ సుమారు మూడు నెలల పాటు సందర్శకులతో ఈ ప్రాంతం పిక్నిక్ స్పాట్‌ను తలిపించి సుదూర ప్రాంతాల నుంచి ప్రకృతి ప్రేమికులు రాళ్లవాగు జలాశయ అందాలను తిలకించేందుకు వరుసకట్టి పోటీపడ్డారు. సందర్శకులతాకిడి కొనసాగింది. అయితే ఈ సారి మాత్రం నెలరోజులు ఆలస్యంగానైన నిండుకుండలామారి మత్తడి పారుతుండడంతో విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు రాళ్లవాగును చేసేందుకు సందర్శకుల తాకిడి మోదలయింది. ఇదిలాఉండగా రాళ్లవాగు సందర్శన కోసం అక్కడికి వచ్చే సందర్శకుల సౌకర్యార్థం తాగునీరు, తదితర సదుపాయాలు లేవని గ్రామపంచాయతీ, గ్రామకమిటీ సభ్యులు చొరవ తీసుకుని సదుపాయాలు కల్పించాలని సందర్శకులు కోరుకుంటున్నారు.



ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారిపై కూలిన పాముల వాగు వంతెన

ప్రకృతి ప్రళయం

- లింగంపేట మండలంలో తెగిపోయిన వంతెనలు
- కొట్టుకుపోయిన పంటలు
- నిలిచిపోయిన రాకపోకలు
- సాయం కోసం ఎదురుచూపులు

లింగంపేట, ఆగస్ట 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఒక్క రోజులో ప్రకృతి ప్రళయం సృష్టించింది. మండలానికి ప్రధాన రహదారి ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారిపై లింగంపల్లి వద్ద పాముల వాగు వంతెన కూలిపోవడంతో కామారెడ్డికి రాకపోకలు నిలిచిపోయాయి. అడ్విలింగాల వద్ద రోడ్డు తెగిపోవడంతో ఎల్లారెడ్డికి రాకపోకలు నిలిచిపోయాయి. శెట్పల్లిసంగారెడ్డి వద్ద వంతెన కూలిపోవడంతో గోపాల్‌పేటకు వెళ్లే దారి లేకుండా పోయింది. కన్నాపూర్ వద్ద వంతెన కూలిపోవడంతో అటు రాకపోకలు నిలిచిపోయాయి. నాగారం వద్ద కాసుల కత్త వంతెన తెగిపోయి బాణాపూర్, కోర్పోల్ బాయంపల్లి గ్రామాలకు బంద్ ఏర్పడింది. ఇలా మండలానికి నాలుగు వైపులా రహదారులు తెగిపోవడంతో మండల ప్రజలు ఎక్కడి వారు అక్కడే సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. సహాయం చేసేందుకు వచ్చేవారు సైతం రాలేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో మొత్తం 11చెరువులు కుంటలకు గండ్లు పడినట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ప్రతీ గ్రామంలో ఒకటి నుంచి మూడు నాలుగు చెరవులు ఉన్నాయి. మండలంలో అధికంగా వరి పండిస్తారు. దీంతో చెరువలకు గండ్లు పడడంతో చెరువుల్లో నీరు లేక వెల వెల పోతున్నాయి. చెరువుల్లోని మట్టి మొత్తం పంటపొలాల్లో చేరి పంటలు మట్టి, ఇసుకతో నిండి పోయాయి. మండలంలో అనేక నివాస గృహాలు కూలిపోయాయి. మండలంలోని పొల్కంపేట చౌదరి చెరువు నిండు కుండలా నిండుకున్న చెరువు వర్షానికి గండిపడి పూర్తిగా చుక్కనీరు లేకుండా ఖాలీ అయ్యింది. పొల్కంపేట, కన్నాపూర్ గ్రామాలకు 600ఎకరాలకు నీరందించే అతి పెద్ద చెరువుకు గండి పడి నీరు లేకుండా పోవడంతో గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. చెరువులోని మట్టి పంట పొలాల్లో చేరి ఎవరి పొలం ఎక్కడ ఉందో తెలుసుకోలేని పరిస్థితిలో ఉందని వారు ఆవేదన చెందుతున్నారు. పొలాల్లో చేరిన మట్టిని, ఇసుకను తొలగించేందుకు రూ.లక్షలు కావాలని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో ఎక్కడ చూసినా తెగిన రోడ్లు, గండ్లు పడిన చెరువులు, బురదతో నిండిన కాలనీలు, కూలిన ఇళ్లు దర్శనమిస్తున్నాయి. అధికారులు స్పందించి వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారి రెండు వైపులా మూసుకుపోవడంతో మండల ప్రజలకు పాలు, చికెన్, ఇతర నిత్యవసర సరుకులు, అత్యవసర మందులు, ఆసుపత్రులకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉందని ప్రభుత్వం వెంటనే స్పందించి తాత్కాలికంగా రహదారిని మరమ్మత్తు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండలంలో రెండు రోజులుగా జీయో, బీఎస్ఎన్ఎల్ సెల్‌ఫోన్ టవర్లు సైతం సిగ్నల్స్ లేక ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ స్తంభా లు లెక్కకు లేనన్ని విరిగిపోయినట్లు ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. మండలంలో అతివృష్టితో కరువు ఏర్పడిందని మండల ప్రజలు ఆవేదన చెందుతున్నారు.



నాగారం వద్ద కూలిన కాసుల కత్త వంతెన

గ్రామాల్లో పెరిగిపోతున్న కుక్కల బెడద



స్వైర విహారం చేస్తున్న కుక్కలు



గాయాలపాలైన బాలుడు

- పట్టించుకున్న వారే కరువు
- పిల్లలపై దాడులు భయాందోళనలో తల్లిదండ్రులు

మోపాల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రోజురోజుకు కుక్కల బెడద పెరిగిపోతుండడంతో పిల్లల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. ఒంటరిగా పిల్లలను ఇంటి నుంచి బయటకు పంపాలంటే భయంగా ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు మండలంలోని ఒక్కొక్క గ్రామంలో 25 నుంచి 30 వరకు ఉన్నాయి గ్రామాల్లో చిన్నపిల్లలపై దాడులు చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి కుక్కల దాడులను గమనించలేక పోతే ప్రాణాలను తీసేస్తున్నాయని గ్రామీణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు గతవారం రోజుల క్రితం నగర సమీపంలోని మాధవ నగర్ కమ్మ సంఘం వెనుక ఓ బాలుడు పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఈ బాలుడితో పాటు మరో బాలికపై కూడా దాడి చేయడానికి కుక్కలు ప్రయత్నిస్తున్నంతో స్థానికులు కుక్కలను బెదిరించడంతో పారిపోయాయి. తీవ్రంగా గాయపడ్డ ఆ బాలుడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు రెండు మూడు రోజులపాటు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఈ గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని స్థానిక మాజీ కార్పొరేటర్ ప్రమోద్ కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకున్న వారే కరువయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు కుక్కలపై దృష్టి పెట్టకపోవడంతో గ్రామాలలో కుక్కలు పెరిగిపోతున్నాయి. వాటిని నియంత్రించడానికి అధికారులు ఎలాంటి చర్య తీసుకోకపోవడంతో గ్రామీణ ప్రజలు బయట తిరగడానికి ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక్కొక్కసారి కుక్కలకు సంబంధించిన ఇంజక్షన్ లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నారు. దీన్ని ఆసరా చేసుకొని ప్రైవేట్ ఆసుపత్రి వారు విపరీతంగా దోచుకుంటున్నారని గ్రామీణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు దృష్టి పెట్టి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

వరద బాధితులకు సాయం అందించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లి



బాధితులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్రకార్యదర్శి జాన్‌వెస్లి, నాయకులు

కామారెడ్డిటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వరద బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయం అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లి అన్నారు. గురువారం కామారెడ్డి పట్టణంలో వరద ముంపుకు గురైన ప్రాంతాలను పరిశీలించారు. వరదను అంచనావేయడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ప్రజలను అప్రమత్తం చేసుంటే ఇంత పెద్ద ఎత్తున నష్టం జరిగి ఉండేది కాదని తెలిపారు.వరదలవల్ల జీఆర్‌కాలనీ, హౌసింగ్ బోర్డుకాలనీ,కౌండిన్య కాలనీలలో ఇళ్లు బురదమయంగా మారిందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే భోజన, నీటి సౌకర్యాలు కల్పించాలని వారికి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాలలో వరదలకు విద్యుత్ సౌకర్యాలు, తాగునీటి పరిస్థితులు లేక ప్రజలు నానా అవస్థలు ఎదుర్కోంటున్నారని తెలిపారు. కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్‌కు తగిన సహాయసహకారాలు అందించాలని విన్నవించారు. జిల్లాలో జరిగిన నష్టనివారణకు రూ.2 వేల కోట్లను ప్రకటించాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రనాయకులు నరసింహారావు, వెంకట్‌రాములు, శోభన్‌నాయక్, జిల్లా నాయకులు చంద్రశేఖర్, వెంకట్‌గౌడ్, కొత్త నర్సింలు, రేణుక,అరుణ్, మోహన్, శ్రీను పాల్గొన్నారు.

ఎకరాకు రూ.20వేల నష్టపరిహారం చెల్లించాలి

భిక్కనూరు: భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ఎకరాకు రూ.20వేల నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. శుక్రవారం భిక్కనూరు మండలంలోని లక్ష్మీదేవునిపల్లి- అంతంపల్లి గ్రామాల మధ్యలో ఉన్న ఎడ్లకట్ట వాగు, గ్రామంలో అకాల భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతంపల్లి - లక్ష్మీదేవునిపల్లి గ్రామాల మధ్య ఉన్న ఎడ్లకట్ట వాగుపై బ్రిడ్జి లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే వాగు పారడంతో ఇరు గ్రామాల ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సీఎం స్పందించి వెంటనే ఈ వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. కామారెడ్డి, మెదక్ జిల్లాలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం వెంటనే చెల్లించి రైతులకు అండగా నిలబడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నర్సింహారావు, శోభన్, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన బురుజులను తొలగించండి



బూర్గుపల్లి గ్రామంలో కూలిన బురుజును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో గల శిథిలావస్థకు చేరిన పురాతన బురుజులను తొలగించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అధికారులను ఆదేశించారు. మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో పాత కాలం నుంచి ఉన్న బురుజు శిథిలావస్థకు చేరి కూలుతుండటంతో ఇలాంటి బురుజులను తొలగించాలని అధికారులను ఆదేశించారు. బురుజులను కూల్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. దీంతో పాటుగానే మండలంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు, ఇళ్ల తదితర వాటి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు త గ్గుముఖం పట్టేంత వరకు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ చూసుకోవాలన్నారు. అంతకు ముం దు మండల కాంగ్రెస్ నాయకులు అధికారులతో కలిసి బూర్గుపల్లి, వడ్లం తదితర గ్రామాలలో కూలిన ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి మాట్లాడుతు భారీ వర్షాల కారణంగా నష్టపోయిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఎవరూ అధైర్య పడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ దశరథ్, మండల ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి, ఆర్ఐ అంజయ్య, నాయకులు డాక్టర్ సంజీవ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



చెరువులను పరిశీలించిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

రైతులు ధైర్యంగా ఉండాలి

జుక్కల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలంలో భారీ వర్షాలు కురవడంతో చెరువులు నిండి అలుగు పారుతున్నందున రైతులు ధైర్యంగా ఉండాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పిలుపు నిచ్చినారు శుక్రవారం రోజు జుక్కల్ మండలం లొంగన్ చెరువు అలుగును పరిశీలించి ఆయన రైతులతో మాట్లాడారు ఇటీవల నాలుగు రోజుల నుండి వర్షాలు కురవడం వాగు వెంట ఉన్న పంట పొలాలు కొంతవరకు నష్టం వాటిందని ఆయన అన్నారు పంట నష్టపోయిన రైతులు అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని ఆయన సూచించినారు వర్షాలు పుష్కలంగా కురవడంతో పూలు నిండుకుండలా మారి యాసంగి సీజన్లో పంటలు పండించుకోవచ్చని ఆయన అన్నారు పంట నష్టపోయిన రైతులను గుర్తించి వ్యవసాయ అధికారులు వచ్చే సర్వే చేయించి నష్టపరిహారం వందే విధంగా కృషి చేస్తామని ఆయన రైతులకు హామీ ఇచ్చినారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ తాసిల్దార్ మారుతి ఆర్ ఐ రామారావు కాంగ్రెస్ నాయకులు రమేష్ దేశాయ్‌పాల్గొన్నారు.

భారీ వర్షాలకు పంటలకు అపార నష్టం

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అల్ప పీడనం కారణంగా మండలంలో గత మూడు రోజుల నుండి కురిసిన భారీ వర్షాలకు భారీగా పంట నష్టం సంభవించింది. ఖరీఫ్ సాగు కింద మండలంలోని ఆయా గ్రామాలలో రైతులు పత్తి, వరి, సోయా, మొక్కజొన్న, పెసర, మినుము లాంటి పంటలను వేల ఎకరాల్లో సాగు చేశారు. పంటలు బాగున్నాయని ఈ సారి తమకు ఆర్థికంగా లాభం చేకూరుతుందనే నమ్మకంతో రైతులు ఉండగా, భారీ వర్షాల కారణంగా పంటలు నేలకొరిగాయి.

కూలిన ఇళ్లపై నివేదిక పంపుతాం

జుక్కల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):జుక్కల్ మండలం కండె, బల్లూర్ గ్రామంలో చాకలి సాయిలు ఇల్లు వర్షాలకు కూలిపోవడంతో శుక్రవారం రోజు తహసీల్దార్ మారుతి ఎంపీడీవో శ్రీనివాస్ పరిశిలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురవడంతో పెంకుటిల్లు కూలిపో యాయని అని అన్నారు. కూలి పోయిన ఇండ్లను గుర్తించి నష్టపరిహారం వచ్చే విధంగా నివేదికలు పంపి పరిహారం ఇచ్చుటకు కృషి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామారావు, పంచాయతీ కార్యదర్శి నవీన్ గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



బీర్కూర్ శివారులో పంట పొలాలను పరిశీలిస్తున్న ఏడీఏ అరుణ

వందల ఎకరాల్లో వరి పంటకు నష్టం

● నీట మునిగిన పొలాలను పరిశీలించిన ఏడీఏ అరుణ

బీర్కూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గత మూడు నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చెరువులు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. భారీ వర్షాల కారణంగా బీర్కూర్ మండలంలో వందలాది ఎకరాల్లో వరి పంటలు నీట మునిగాయి. వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ఏడీఏ అరుణ శుక్రవారం బీర్కూర్ మండలంలో పర్యటించారు. ఆయా గ్రామాలలో నీట మునిగిన వరి పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. వారి వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు పంపి ంచనున్నట్లు తెలిపారు. ప్రాథమిక అంచనాల మేరకు 150 ఎకరాల్లో వరి పంటలకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఆమె వెంట రైతులు, ఏఈఓలు తదితరులు ఉన్నారు.



బీర్కూర్ మంజీరా నది వైపు వెళ్లకుండా ట్యాంకర్‌లను అడ్డు పెడుతున్న దృశ్యం

మంజీరా నది బ్రిడ్జిపై రాకపోకలు బంద్

బీర్కూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఇదిలా ఉండగా బీర్కూర్ గ్రామ శివారులోని గైపీర్ల వాగు పొంగిపొర్లడంతో మంజీరా నది వైపు వెళ్ళే రహదారి పై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో పోలీసులు ఈ రహదారిపై రాకపోకలను నిలిపి వేశారు. మంజీరా వారధి వైపు వెళ్ళే రహదారికి అడ్డంగా ట్యాంకర్లను అడ్డు పెట్టారు. వరద ఉధృతి తగ్గే వరకు ప్రయాణాలు చేయవద్దని అన్నారు. బిచ్కుంద, దెగ్లూర్, కుర్లా వైపు నుండి బీర్కూర్ వైపు వచ్చే వారు బీర్కూర్ నుండి అటువైపు వెళ్ళే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటువైపు నుండి ఇటు వైపు, ఇటు వైపు నుండి అటువైపు వెళ్లకుండా పోలీసులు రెండు వైపుల భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. వందలాది మంది ప్రయాణికులు వరద ఉధృతి కారణంగా వెనుతిరిగి వెళ్ళిపోయారు.



నాగిరెడ్డిపేట - బంజారా మధ్యన జాతీయ ప్రధాన రహదారిపై వరద నీరు తగ్గడంతో మండల కేంద్రానికి కాలినడకన వస్తున్న ప్రజలు

నాగిరెడ్డిపేట - బంజారా మధ్య
ప్రధాన రహదారిపై తగ్గిన వరద

● మండల కేంద్రానికి కాలినడకన బైక్‌లపై వస్తున్న ప్రజలు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట - బంజారా గ్రామాల మధ్యన గల జాతీయ ప్రధాన రహదారిపై వరద నీరు తగ్గడంతో మండల కేంద్రానికి కాలినడకన, బైకుల పైన ప్రజలు శుక్రవారం ఉదయం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. భారీ వర్షాల కారణంగా వరద నీటితో ఈ ప్రధాన రహదారి పూర్తిగా నీట మునిగింది. మంజీరా వరద నీటితో, నాగిరెడ్డిపేట పటేల్ చెరువు కట్ట తెగిపోవడంతో, నాగిరెడ్డిపేట గ్రామానికి వెళ్లే రోడ్డు నీటి ప్రవాహానికి తెగిపోవడంతో, ఎడతెరిపి లేకుండా భారీగా వర్షాలు కురువడంతో ఈ ప్రధాన రహదారిపైన ఉధృతంగా వరద నీరు రావడంతో ప్రధాన రహదారి వరద నీటితో మునిగిపోయింది. ఈ ప్రధాన రహదారి పైన వాహనాల రాకపోకలు సాగించేందుకు త్వరగా సంబంధిత అధికారులు మరమ్మత్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎల్లారెడ్డికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతా..

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు



పోచారం ప్రాజెక్టు వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో భారీగా నష్టం జరిగిందని, నష్టపోయిన వారిని ఆదుకోవడానికి అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఎల్లారెడ్డి నియోజకవర్గానికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్టు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు తెలిపారు. ఆయన శుక్రవారం సాయంత్రం పోచారం ప్రాజెక్టును సందర్శించారు. భారీ వరద తాకిడికి పోచారం ప్రాజెక్టు వద్ద కోతకు గురై గుంత ఏర్పడిన ప్రాంతంలో జరుగుతున్న మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎల్లారెడ్డి నియోజకవర్గంలో సుమారు 70 సంవత్సరాలుగా కనీ ఇవన్నీ ఎరుగని రీతిలో భారీ వర్షం కురిసి భారీగా విధ్వంసం జరిగిందని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలలో భారీ వర్షాలకు పంటలు నీట మునిగాయని, ఇండ్ల కూలిపోయాయని, రోడ్లు ధ్వంసం అయ్యాయని, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని ఆయన తెలిపారు. భారీ వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించేలా కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. పోచారం ప్రాజెక్టుకు ఎన్నడూ లేనంతగా ఒక లక్ష 82 వేల క్యూసెక్కుల భారీ వరద వచ్చినప్పటికీ ప్రాజెక్టు చెక్కుచెదరలేదని, ప్రస్తుతం ప్రాజెక్టు సేఫ్ జోన్‌లో ఉందని ఆయన తెలిపారు. భారీ వరద కారణంగా ప్రాజెక్టు వద్ద మట్టి కోతకు గురికాగా సంబంధిత అధికారులు, కాంగ్రెస్ నాయకులు వెంటనే స్పందించి మరమ్మత్తు చర్యలు చేపట్టడం జరిగిందని, వారందరినీ అభినందిస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తున్నారని తెలిపారు. పంట నష్టపోయిన వివరాలను అధికారులు అంచనాలు వేస్తున్నారని, పంట నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందించడానికి కృషి చేస్తున్నానని, రైతులు దిగులు చెందొద్దని ఆయన భరోసా నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస రావు, సీఐ రాజారెడ్డి, స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్ రావు, ఎస్సై భార్గవ్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, తాండూర్ సొసైటీ అధ్యక్షుడు గంగారెడ్డి, నాయకులు రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విక్రాంత్ రెడ్డి, ఇమామ్, సురేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణి ప్రాజెక్టు తెగిన కట్ట పరిశీలన

ఎల్లారెడ్డి: గత మూడు రోజుల క్రితం వరుసగా కురిసిన భారీ వర్షాలకు ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి శివారులో ఉన్న కళ్యాణి ప్రాజెక్ట్‌కు వరద ఉద్రిక్తత పెరగడంతో కట్ట తెగి వరద దిగువకు వెళ్ళడం వల్ల పంట ఆస్తి నష్ట పోయిన అన్నాసాగర్ బొగ్గు గుడిసె, కళ్యాణి అన్నసాగర్ తాండ గ్రామాలలో వరద ఉద్రిక్తంగా ప్రవహించి చాలామంది రైతులకు బొగ్గు గుడిసె ప్రాంతంలో ఉన్న నివాసపు ఇల్లు కూడా కొట్టుకపోవడంతో శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ నేరుగా వరద ఉధృతకు నష్టపోయిన వారి కుటుంబాలను పరిశీలించారు. వరద బాధితులకు ప్రభుత్వం నుండి సహాయమందే విధంగా చర్యలు చేపడతామని క్షేత్రస్థాయిలో నష్టపోయిన రైతులకు ప్రజల పట్ల అధికారులు పంట ఇతర ఇండ్లు ఇంకివైన నష్టపోయిన వాటి గురించి పూర్తిస్థాయిలో సర్వేలు చేసి నివేదికలు అందజేస్తారని, నష్టపోయిన రైతులకు ప్రజలకు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అంది విధంగా ఖచ్చితంగా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే మదన్మోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కురుమ సాయిబాబా, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు కుడుముల సత్యనారాయణ పద్మ శ్రీకాంత్ తిమ్మారెడ్డి మాజీ సరంచ్ శ్రీనివాస్ రెడ్డి ఎల్లారెడ్డి మాజీ జడ్‌టిసి ఉషాగౌడ్ సామేల్ , అన్నసాగర్ సాగర్ మాజీ సరంచ్ పెరుగు నాగరాజు, వరద బాధితులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సేవలందిస్తున్న వారికి ధన్యవాదాలు : ఎస్పీ



మద్నూర్ వరద బాధిత సహాయ కేంద్రంలో మాట్లాడుతున్న ఎస్పీ

మద్నూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర పరిస్థితుల్లో ఉన్న బాధితులను వరద ప్రాంతాల నుంచి తరలించి సురక్షిత ప్రాంతాలకు చేర్చిన వారికి కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం మద్నూర్ మండల కేంద్రంలోని వరద బాధిత సహాయ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు అన్ని విధాల ఆదుకుంటున్న అధికారులకు ప్రజాప్రతినిధులకు స్వచ్ఛంద సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. సహాయ కేంద్రాలలో ఎటువంటి వాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రెండు రోజులపాటు వర్షాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

ధైర్యంగా ఉండండి

నిజాంసాగర్: గోర్గల్ పునరావస కేంద్రంలో ఉంటున్న మరి పల్లి గ్రామస్తులు ధైర్యంగా ఉండండి అధికారులు అన్ని వసతులు కల్పిస్తారని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర భరోసా ఇచ్చారు. శుక్రవారం నాందేడ్ ఎల్లారెడ్డి రహదారిలో ఉన్న బొగ్గు కూడలి వద్ద కొట్టుకుపోయిన రహదారిని నవోదయ సమీపంలో గల మంజీర వంతెనను ఆయన పరిశీలించారు. అనంతరం గోరుగల్ ఫంక్షన్ హాల్‌లో మర్పల్లి గ్రామ ప్రజలను సురక్షితంగా ఉంచేందుకు ఉన్న ప్రజలతో మమేకమయ్యారు. కేంద్రంలో నివాసముంటున్న చిన్నారులకు ఎస్పీ పండ్లను పంపిణీ చేశారు. భారీ వరదల్లో చిక్కుకుపోయిన ప్రజలను కాపాడడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బందిని ఆయన ప్రశంసించారు. ఆయన వెంట బాన్సువాడ డి.ఎస్.పి విట్టల్ రెడ్డి, బాన్సువాడ రూరల్ సీఐ తిరుపతయ్య, ఎస్సై శివకుమార్, పంచాయతీ కార్యదర్శి తుకారాం, వైద్యారోగ్య సిబ్బంది తదితరులున్నారు.



కోళ్ల ఫారంలో నీరు చేరడంతో మృతి చెందిన కోళ్లు

తెగిన చెరువు కట్ట

● మృతి చెందిన 6500 కోళ్లు

ఎల్లారెడ్డి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు వరద ఉద్రిక్తత పెరిగి ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్ చెరువు కట్ట తెగి భారీ వరద నీరు దిగువకు చేరడంతో ఆ ప్రాంతంలో ఉన్న కోళ్ల ఫాంలోకి నీళ్లు చేరి నిలువ ఉండడంతో అందులో ఉన్న ఆరు వేల ఐదు వందల కోళ్ళు మృతి చెందినట్లు యజమాని దుంపల కృష్ణ ప్రసాద్ తెలిపారు. వాటితో పాటు ఆరు మేకలు ఒక ఆవు కూడా వరదల్లో చిక్కుకొని కొట్టుకపోయినట్లు తెలిపారు. ఆస్తి నష్టం మొత్తం సుమారు ఏడు లక్షల వరకు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



రోడ్డుపై పడిఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న గ్రామస్తులు

చెట్ల కొమ్మలను తొలగించిన యువకులు

ఎల్లారెడ్డి రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు ఎల్లారెడ్డి నుండి భిక్కనూరు గ్రామానికి వెళ్లే దారిలో పోతులగడ్డ తాండా గేటు వద్ద బీటీ రోడ్డు కింద ఉన్న మొరం కోతకు గురై రోడ్డు కుంగింది. మిసాన్‌పల్లి గ్రామానికి చెందిన చెరువు అలుగు పారిన వరద నీరు అటువైపు రావడంతో బీటీరోడ్డు కింద ఉన్న మొరం భారీగా కోతకు గురైంది. రోడ్డుపైకి సాధారణంగానే కనిపించినప్పటికీ బీటీ కింద ఎలాంటి మట్టి లేకపోవడంతో పెన ప్రమాదం జరిగే ఆస్కారం ఉంది. ఇది గమనించి భిక్కనూరు గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ గోనే శ్రీకాంత్ స్పందించి శుక్రవారం గ్రామానికి చెందిన పలువురి యువకులతో కలిసి దాని చుట్టూ చెట్ల కొమ్మలు వేసి భారీకేడ్ లాగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఉపసర్పంచ్ గోనే శ్రీకాంత్ మాట్లాడుతూ వెంటనే సంబంధిత శాఖ అధికారులు కుంగిన బీటీ రోడ్డుకు మరమత్తులు చేయాలని కోరారు. ఈ విసయమై సంబంధిత శాఖ అధికారులకు సమాచారం ఇచ్చామని ఆయన తెలిపారు. ఆయన వెంట కారోబర్ రాజు, గ్రామ యువకులు పృథ్వీ, సాయిలు, తదితరులు ఉన్నారు.

వరద ప్రభావంతో దెబ్బతిన్న పంటలు

ఎల్లారెడ్డి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మంగళవారం సాయంత్రం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లాయి. దీంతో పలు గ్రామాల చెరువుల కట్టలు తెగి దిగువకు నీరు వృధా పోయి వాగుల్లో చేరడంతో కళ్యాణి వాగు ఉధృతి పెరిగి అడవి లింగాల, లింగారెడ్డిపేట్, కళ్యాణి, తిమ్మారెడ్డి, అన్నాసాగర్, అజామాబాద్, గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. అదే విధంగా పంట పొలాల్లో భారీ వరద వల్ల వరి పంటలు నీట మునిగి వరద ఉధృతి వల్ల ఇసుక మట్టి దెబ్బలు పెట్టాయి. దీంతో పంట నష్టంతో పాటు ఆస్తి నష్టం నెలకొంది అని ఆయా గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు.



కూలిన ఇంటిన పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి

భారీ వర్షానికి నేలకొరిగిన వరి పంట

బాన్సువాడ రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని సంగోజీపేట్, కోనాపూర్ గ్రామాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి పంట నేలకొరిగి వంతెనలపై నుండి నీరు ప్రవహించడంతో పంట పోలాల్లో ఇసుక మేటలు వేసి వంతెనల వద్ద రోడ్డు కోతకు గురి కావడంతో వాహనదారులు, రైతులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వంతెనలపై నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నప్పటికీ సంబందిత అధికారులు ప్రమాత హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడంతో ప్రజలు ప్రమాదాల బారిన పడే ఆస్కారం ఉందని ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాల్సి బాధ్యత ఉందన్నారు. బాన్సువాడ మండలంలోని కోనాపూర్, ఖద్దపూర్ గ్రామాలలో ఇటీవల కురిసిన వర్షాలకు కూలిన ఇండ్లను శుక్రవారం మండల ప్రత్యేక అధికారి డీఈవో రాజు ఎంపీడీవో ఆనంద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోనాపూర్ గ్రామంలోని మెరుగు వెంకట్, పోచయ్య, దత్తారాం, వడ్ల ఆగమయ్య ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, ఖద్దపూర్ గ్రామంలో కాశి భాయ్ ఇల్లు కూలినట్లు వారు తెలిపారు. కురుస్తున్న భారీ వర్షాలకు పురాతన ఇండ్లలో నివాసం ఉండరాదని ప్రజలకు సూచించారు. బాన్సువాడ మండలంలోని సంగోజీపేట్ గ్రామ శివారులో వాగు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డుపై నీరు ప్రవహించడంతో రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారడంతో డీఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు తీవ్రంగా దెబ్బతినడంతో రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు మరో దారి నుండి గ్రామంలోకి వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు భరత్, మోహన్, షాహిన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గత 4రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి సర్వం కోల్పోయి నిరాశ్రయులైన ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్, బోగ్గు గుగిసె గ్రామాల బాధితులను శుక్రవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ప్రత్యక్షంగా కలిసి వారిని పరామర్శించారు. వరద బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధ్వంసమైన రోడ్లు, ఇండ్లను పరిశీలించారు. అధికారులతో సంప్రదించి పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పాల్వంచ బ్రిడ్జిపై రాకపోకలు బంద్



కోతకు గురైన పాల్వంచ రోడ్డు

పాల్వంచ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుసిన వర్షాలతో భారీగా వస్తున్న వరద నీటి ప్రభావంతో పాల్వంచ బ్రిడ్జికి ఇరువైపుల రోడ్డు కింది బాగంలో మట్టి కొట్టుకుపోయింది. రోడ్డు కుంగటం ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద వస్తుండటంతో బ్రిడ్జి ప్రమాదకర స్థితిలో ఉంది. బ్రిడ్జి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మాచారెడ్డి ఎస్సై అనీల్ బ్రిడ్జికి ఇరువైపుల భారీకేడ్లు ఏర్పాటు చేసి ప్రజలను బ్రిడ్జిపై నుంచి అనుమతించడం లేదు. కామారెడ్డి- కరీంనగర్, సిద్దిపేట లాంటి దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులు రవాణ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చాలాగ్రామాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. ఇండ్లు కూలిపోగా అధికారులు పరిశీలించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

వరద వీడింది..

(5వ పేజీ తరువాయి)

ఇళ్లను చూసి కొందరు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇంట్లో ఉన్న విలువైన సామగ్రి మొత్తం నానిపోవడం, బురదమయం కావడంతో విలువైన వస్తువులు పనికిరాకుండా పోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 11 గంటల తర్వాత నిమిషాల వ్యవధిలో నడుములోతు వరకు నీరు రావడంతో ఏం చేయాలో తెలియక తమ ప్రాణాలు ఇక మిగిలవేమోనని భయానికి గురయ్యామని వాపోయారు. కొందరు బురదను తొలగించే ప్రయత్నాలు చేసుకున్నప్పటికీ మరికొందరు మాత్రం నానా అవస్థలు పడ్డారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నడుములోతు నీరు ప్రవహించడంతో ఆయా కాలనీల్లో ఇళ్లలోకి బురదతో పాటు పాములు, విషపు పురుగులు కొట్టుకువచ్చాయని బాధితులు చెబుతున్నారు. మున్సిపల్ సానిటరి ఇన్స్‌పెక్టర్ పర్వేజ్ పర్యవేక్షణలో మున్సిపల్ కార్మికులు, అగ్నిమాపక సిబ్బంది, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది దగ్గరుండి ప్రతీ ఇంటిని శుభ్రపరిచేలా చూశారు.

సమస్యలపై గళం విప్పేనా?

(5వ పేజీ తరువాయి)

మదన్‌మోహన్‌రావు, తోట లక్ష్మీకాంతరావు, కాటిపల్లి వెంకట రమణారెడ్డిలు వరద నష్టంపై ప్రస్తావించి బాధితులకు పరిహార ఇప్పించే విధం గా, దెబ్బతిన్న రోడ్లు, నీటి వనరులను పునరుద్ధరించేలా నిధులు రాబట్టాల్సిన బాధ్యత ప్రతినిధులపై ఎంతైనా ఉంది.

దారులు.. ధ్వంసం..

జిల్లాలో వరదలతో ప్రధానంగా రహదారులపై తీవ్ర ప్రభావం పడింది. అన్ని ప్రాంతాల్లో వరదల తాకిడికి రహదారులు ధ్వంసం కావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. 44వ జాతీయ రహదారితో పాటు, రాష్ట్ర రహదారులు, గ్రామీణ రోడ్లు కొట్టుకుపోయాయి. ఇలా జిల్లాలో అన్ని మార్గాల్లో రోడ్లు తెగిపోవడంతో ఇతర జిల్లాలకు సత్సంబంధాలు తెగిపోయాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఇలా కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో 58 చోట్ల రహదారులు కొట్టుకుపోయాయి. ఇందులో ఆర్‌అండ్‌బీ 34, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించివి 24చోట్ల రోడ్లు తెగిపోయాయి. రోడ్ల ధ్వంసానికి రూ.వందల కోట్లలోనే నష్టం వాటిల్లినట్లు సంబంధిత శాఖల అధికారులు చెబుతున్నారు. ఈ రోడ్లను పునరుద్ధరిస్తే గాని జిల్లాలో రవాణా సౌకర్యం మెరుగుపడుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా ఎమ్మెల్యేలు అసెంబ్లీలో లేవనెత్తి యుద్ధ ప్రాతిపదికన రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వాన్ని నిధులు మంజూరు చేసేలా డిమాండ్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అన్నదాతను ఆదుకోవాల్సిందే..

జిల్లాలో వరదలు అన్నదాతలను అతలాకుతులం చేశాయి. వేలాది ఎకరాల్లో వరదలు పంటలను ముంచెత్తాయి. వందలాది మంది రైతులు అపార నష్టాన్ని చవిచూడాల్సి వస్తోంది. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గంలో వరదలు తాకిడికి 93,925 ఎకరాలలో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. 64,193 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ రైతులందరికీ పంట నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాల్సిన బాధ్యత జిల్లా ఎమ్మెల్యేలపై ఉంది. పంట నష్టపరిహారం రైతులకు ఇప్పించేలా ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రస్తావించాలి అని బాధిత రైతులు కోరుతున్నారు.

నీటి వనరులను ఆధునికీకరించాల్సిందే..

జిల్లాలో ప్రధాన నీటి వనరులైన నిజాంసాగర్, పోచారం, కౌలాస్ ప్రాజెక్టులు నిజాం కాలంలో నిర్మించినవి. ఈ ప్రాజెక్టులు నిర్మించి దాదాపు వంద సంవత్సరాలు గడుస్తున్నాయి. అయితే ప్రకృతి వైపరీత్యాలు, భారీ వరదల సమయంలో ఈ ప్రాజెక్టులకు ముప్పు పొంచి ఉంది. తాజాగా వచ్చిన వరదలతో పోచారం ప్రాజెక్టు గట్టు మట్టి కోతకు గురైంది. వరద ప్రవాహానికి ప్రాజెక్టుకు ఎక్కడ ముప్పు వాటిల్లుతుందోనని జిల్లా అధికార యంత్రాంగంతో పాటు, ముంపు గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ వెల్లదీశారు. అయినప్పటికీ ప్రాజెక్టు వరదల తాకిడికి నిలబడడంతో ముప్పు తప్పింది. అయితే ఈ ప్రాజెక్టు ఎత్తు పెంచి ఆధునికీకరించాలని గతంలోనే ప్రతిపాదించారు. అయినప్పటికీ ప్రభుత్వాలు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నాయని జిల్లావాసులు మండిపడుతున్నారు. అదేవిధంగా వరదల తాకిడికి జిల్లాలో 55 చెరువులకు పైగా గండ్లు పడడంతో పాటు, తూములు, కట్టలు కొట్టుకుపోవడంతో తీవ్రంగా నష్టం వాటిల్లింది. చెరువులకు మరమ్మతులు చేసేందుకు, ప్రాజెక్టుల ఆధునికీకరణకు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో లేవనెత్తి నిధులు రాబట్టాలి.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్

(5వ పేజీ తరువాయి)

పడుతున్నారు. అయితే ఆదిలాబాద్ నుంచి వచ్చే వాహనాలను ఆర్మూర్ నిజామాబాద్ మీదుగా దారి మళ్లిస్తున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలను రామాయంపేట వద్ద దారి మళ్లిస్తున్నారు. జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో ఎస్పీ రాజేష్‌చంద్ర పర్యవేక్షించారు. 44వ జాతీయ రహదారి గుండా ఆదిలాబాద్ హైదరాబాద్ నుంచి వచ్చే వాహనదారులు నిర్మల్, ఆర్మూర్, మేడ్చల్ మార్గాల్లో ట్రాఫిక్ డైవర్షన్ తీసుకోవాలని ఎస్పీ రాజేష్‌చంద్ర సూచించారు. కామారెడ్డి జిల్లాలో భారీ వర్షాల కారణంగా 44వ జాతీయ రహదారి డ్యామేజ్ కావడంతో వన్‌వేకు అత్యవసర వాహనాలకే అనుమతులు ఇస్తున్నామన్నారు. వాహనదారులు ఇతర మార్గాల ద్వారా వెళ్లాలని సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ టౌన్, ఆగష్టు 29 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల దృష్ట్యా బాన్సువాడ నియోజకవర్గ ప్రజలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ లంగ్ ఇన్‌ఫెక్షన్ కారణంగా వైద్యుల సలహామేరకు చికిత్సలు తీసుకునేందుకు హైదరాబాద్‌లో ఉన్నానన్నారు. వాతావరణ శాఖ కామారెడ్డి జిల్లాకు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీ చేసిన దృష్ట్యా లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్షాల కారణంగా రోడ్లు దెబ్బతింటున్నాయని ప్రజలు తమ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఏదైన ఇబ్బందులు తలెత్తినట్లయితే తనయుడు, మాజీ డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్‌రెడ్డి, నాయకులు, అధికారులదృష్టికి తీసుకరావాలన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలి

● ప్రముఖ పద్య కవి వెంకట్

మద్నూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోనీ తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయ జూనియర్ కళాశాలలో తెలుగుభాషా దినోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగ గిడుగు చిత్రపటమునకు పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వేంకట రామ్మూర్తి పంతులు జయంతిని తెలుగుభాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని ప్రముఖ పద్య కవి వెంకట్ అన్నారు. తెలుగుకథలను వినాలని, తెలుగు నుడికారాలు తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యన్.గంగాకిశోర్, తెలుగు పండితులు ప్రవీణ్ కుమార్, సీనియర్ ఉపాధ్యాయులు బి.సుమన్, జె.గణేశ్ వేణుగోపాల్, నరహరి, హన్మాండ్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- వార్-2
ప్రియ 35- మహావతర్ నరసింహ
దర్శన్- పరదా, బన్ బటర్ జామ్

బాన్సువాడ

మహేశ్వరి	బ్రహ్మాండ
వెంకటేశ్వర	కూలీ

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.160	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230